సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 8 । మే । 2024


ఆదరించండి: అమర్‌నాథ్‌ను పరిచయం చేస్తున్న సీఎం జగన్




మేమంతా సిద్ధం : నినదిస్తున్న గాజువాక జనం


వినూత్నంగా యువకుల ప్రదర్శన


గాజువాకలో సీఎం జగన్ సభకు హాజరైన జనసందోహం

అబద్ధాల కోరులపై జన సూరీడు నిప్పులు


'గుర్తు'ంచుకోండి: ఫ్యాన్ గుర్తుకే మన ఓటు

మోసాలు.. అబద్ధాలు.. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబుకు చరమగీతం పాడాలని అతడు పిలుపిస్తే జనవాహిని కదలి కెరటాల ఘోషతో స్పందించింది. రాష్ట్రాన్ని తోడేళ్ల గుంపులా పీక్కుతిన్న.. మళ్లీ తినేందుకు అబద్ధాలకు రెక్కలు కట్టిన మేనిఫెస్టోతో వస్తున్న వచ్చనేతల దురాగతాలు, కుట్రలను అతడు లెక్కలతో వివరిస్తే.. ఈ ఎన్నికల్లోనూ తరిమికొడతామని ప్రజావళి మేఘాల గర్జనలా నినదించింది. విలువలు.. విశ్వసనీయతతో ఐదేళ్లు పాలన సాగించిన తనను ఆశీర్వదించమని అభ్యర్థిస్తే.. మలయమారుతం పలకరించినట్టు ముక్తకంఠంతో దీవించింది. ప్రజాసేవే పరమావధిగా నిస్వార్థంగా పని చేస్తే.. ప్రకృతి సైతం సహకరిస్తుంది. పేదల కడుపు నింపడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కర్తవ్యం నిర్వర్తిస్తే సమస్త దేవగణమే అండగా కదలివస్తుందంటారు. ఇందుకు గాజువాకలో మంగళవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సభే ప్రత్యక్ష నిదర్శనం. వాతావరణం అనూహ్యంగా చల్లబడటంతో గాజువాక పులకించింది. అభిమాన నేతను చూడాలన్న తపన.. ఆయన చెప్పేది వినాలన్న ఉత్సుకత.. ప్రత్యక్షంగా ఆయనకు మద్దతు తెలపాలన్న లక్ష్యంతో ఉప్పెనలా తరలివచ్చిన జనంతో కిక్కిరిసింది.




యువతోత్సాహం: సీఎం జగన్ వెంటే మేమంతా సిద్ధం అంటున్న యువకులు

- పారిశ్రామికవాడలో పోటెత్తిన జనం
- గాజువాకకు ఉప్పొంగిన జన ప్రవాహం
- రోడ్లు కిక్కిరిసిపోవడంతో మిద్దెలెక్కిన అభిమానం
- వన్స్ మోర్ సీఎం నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం
- చంద్రబాబు బూటకపు వాగ్దానాలను ఎండగట్టిన సీఎం జగన్


మా నమ్మకం నువ్వే జగన్.. మేం నమ్ముతాం నిన్నే జగన్ : సభకు హాజరైన జనం

సాక్షి, విశాఖపట్నం/గాజువాక:

పారిశ్రామికవాడ జనసునామీని తలపించింది. పాత గాజువాక జంక్షన్ జనసందోహంతో నిండిపోయింది. సాయంకాల సమయంలో.. చల్లని వాతావరణంలో తమ అభిమాన నేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ఉప్పెనలా తరలివచ్చింది. చెక్కు చెదరని ఉత్సాహంతో వేలాది మంది కేరింతలు... విజిల్స్‌తో పాత గాజువాక 80 ఫీట్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభ హోరెత్తింది. అటు కూర్మనపాలెం.. ఇటు అక్కిరెడ్డిపాలెం.. అటు పెదగంట్యాడ.. ఇటు కొత్త గాజువాక వైపు రహదారులు జనంతో కిటకిటలాడాయి. పాత గాజువాక జంక్షన్ నుంచి పెదగంట్యాడ వైపు రహదారి జన ప్రవాహాన్ని తలపించింది. రోడ్లన్నీ జనాలతో కిక్కిరిసిపోవడంతో అభిమాన నేతను చూసేందుకు చాలా మంది మిద్దెలు, మేడలెక్కారు.

జై జగన్ నినాదాల హోరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. సీఎం.. సీఎం .. అనే నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. అన్నా.. నిన్ను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు సిద్ధం అంటూ యువత ప్లకార్డులు ప్రదర్శించింది. 2014 ఎన్నికల్లో చంద్రబాబు, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ఇచ్చిన మేనిఫెస్టో బ్రోచర్‌ను చూపిస్తూ అందులో ఒక్క హామీనైనా చంద్రబాబు నెరవేర్చాడా అని సీఎం జగన్ ప్రశ్నించగా.. 'చంద్రబాబు వద్దు.. జగనన్నే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీని గెలిపించడానికి సిద్ధమా..? అని పిలుపునిచ్చిన వెంటనే మేమంతా సిద్ధం అని సభలో ఉన్న జనసందోహమంతా రెండు చేతులు ఊపుతూ అభివాదం చేసింది. ఒకవైపు చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను చీల్చి చెండాడుతూనే.. మరోవైపు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సీఎం జగన్ ప్రజలకు వివరించిన తీరు ఆలోచింపజేసింది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని, రాష్ట్రంలో ఎన్నడూ చూడని విధంగా, లంచాల్లేని పాలన అందించామన్నారు. లక్షలాది మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 59 నెలల్లో అందించిన సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలన్నారు.

ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలి

వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌లను బస్సుపై నుంచి సీఎం జగన్ పరిచయం చేశారు. నా తమ్ముడు.. యువకుడు.. ఉత్సాహవంతుడు అమర్‌పై మీ చల్లని దీవెనలు ఉంచాలని.. అమర్‌నాథ్‌ను గెలిపించి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు విశాఖ వ్యతిరేకమని యావత్ దేశానికి మెసేజ్ పంపాలని పిలుపునిచ్చారు. పొరపాటున టీడీపీకి ఓటు వేసి గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి మద్దతు తెలిపినట్లే అని గుర్తుంచుకోవాలన్నారు. నాకు తల్లిలాంటిది.. నా అక్క బొత్స ఝాన్సీపై మీ చల్లని దీవెనలు ఉంచాలని.. విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న ఆమె మీ మంచి కోసం పనిచేస్తుందని తాను బలంగా నమ్ముతున్నానన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఇద్దరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఉమ్మడి విశాఖ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీవీ సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కె.కె రాజు, ఆడారి ఆనంద్ కుమార్, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, మాజీ మేయర్ పులుసు జనార్దనరావు, ముఖ్య నేతలు తిప్పల దేవన్‌రెడ్డి, జీవీ, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, మంత్రి రాజశేఖర్, ఉరుకూటి చందు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ భవితవ్యం మీ చేతుల్లోనే..

మోదీ, చంద్రబాబు, దత్తపుత్రుడు ముగ్గురూ కలిసి 2014లో మాదిరి మోసం చేయడానికి మళ్లీ మీ ముందుకు వస్తున్నారని, మోసపోవద్దని సీఎం జగన్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ఆమోద యోగ్యం కాని హామీలతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతున్నారని, ఎవరూ నమ్మవద్దన్నారు. గాజువాకలో టీడీపీని గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి మద్దతు పలికినట్లేనని.. వైఎస్సార్ సీపీని గెలిపిస్తే విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని అన్న మరుక్షణమే.. జై జగన్.. జై విశాఖ.. అంటూ హర్షాతిరేకాలతో కేరింతలు కొట్టారు. వన్స్ మోర్ సీఎం.. వుయ్ వాంట్ విశాఖ రాజధాని అంటూ నినాదాలు చేశారు.



ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టండి

ప్రజలను మోసం చేయడానికే ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి వస్తున్నాయి. వాటి మాయలో పడి ఏ ఒక్కరూ మోసపోవద్దు. వాటి కుట్రలను తిప్పికొట్టండి. విశాఖను పరిపాలన రాజధానిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టారు. భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ నాలుగో స్థానంలో ఉంది. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నారు.. ఇప్పటికే పది మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి కాగా మరో ఏడు నిర్మాణంలో ఉన్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగన్‌తో సాధ్యమైంది. ఇన్ఫోసిస్ లాంటి ఐటీ కంపెనీలతోపాటు మరెన్నో సంస్థలు, పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలను కల్పించారు. మన కోసం ఆలోచిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. తన పుట్టింటి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ప్రజలు కూడా తనను ఆశీర్వదించాలి. గత మేనిఫెస్టోలో అంశాలను ఒక్కటి కూడా అమలు చేయని చంద్రబాబు ఈసారి సూపర్ సిక్స్‌తో మళ్లీ వస్తున్నాడు.. డకౌట్ చేయాలి.

– వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



ఉక్కు ప్రైవేటీకరణ, రైల్వే జోన్‌పై చెప్పకుండా విమర్శలా..

విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్ అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎటువంటి వివరణ ఇవ్వకుండా జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించడం శోచనీయం. స్టీల్‌ప్లాంట్ విషయంలో ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసిరామని, దాని గురించి మాట్లాడే ధైర్యం కూడా వారు చేయలేకపోయారు. టీడీపీకి ఏదో విధంగా అధికారంలోకి రావాలన్న ధ్యాసే తప్ప ప్రజల సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలు పట్టవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ వస్తుంది.. జగన్ సారథ్యంలోనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా పోరాటం సాగిస్తాం. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు మాత్రం విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం గాని, ప్రత్యేక హోదా కోసం గాని, విభజన హామీల కోసం గాని మాట్లాడరు కానీ అధికారం కోసం మాత్రం ఆరాటపడుతున్నారు. ప్రతి కుటుంబంలో మంచి జరిగితేనే తనకు ఓటు వేయాలని చెప్పిన దమ్మున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. స్వతంత్ర భారతదేశంలో ఇటువంటి ప్రకటన ఏ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి చేయలేదు. గాజువాకలో ఎమ్మెల్యే నాగిరెడ్డి హయాంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. గంగవరం నిర్వాసితులు, కార్మికుల సమస్యలను, స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం.

– వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

ప్రశాంతంగా హోమ్ ఓటింగ్

తొలి రోజు ఓటేసిన 980 మంది వృద్ధులు, దివ్యాంగులు


అక్కయ్యపాలెంలో ఓటు వేస్తున్న సాయిమోహన్

మహారాణిపేట: హోమ్ ఓటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. 85 ఏళ్లు నిండిన వృద్ధులు, 40 శాతం దివ్యాంగులు ఇంటి దగ్గర నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారుల సర్వేలో 1,523 మంది హోమ్ ఓటర్లుగా నమోదు కాగా.. 980 మంది తొలి రోజు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70 శాతం మంది ఓటు వేశారు. బుధవారం కూడా హోమ్ ఓటింగ్ కొనసాగుతుంది. భీమిలి నియోజకవర్గంలో 9 టీమ్‌లు, విశాఖ తూర్పులో 6 టీమ్‌లు, దక్షిణలో 6 టీమ్‌లు, ఉత్తరలో 12 టీమ్‌లు, పశ్చిమలో 8 టీమ్‌లు, గాజువాకలో 5 టీమ్‌లు, పెందుర్తిలో 5 టీమ్‌లు చొప్పున మొత్తంగా 51 ఎన్నికల బృందాలు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి హోమ్ ఓటింగ్ నిర్వహించాయి. ఒక్కో టీమ్‌లో స్థానిక బీఎల్‌వో, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జి, గెజిటెడ్ ఆఫీసర్, మార్క్‌డ్ కాపీ ఇన్‌చార్జి, మైక్రో అబ్జర్వర్ తదితరులు ఉన్నారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియ మొత్తాన్ని ఒక వీడియోగ్రాఫర్ చిత్రీకరించారు.


అక్కయ్యపాలెంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న 85 ఏళ్ల రహీం మున్నీసా బేగం

చందనోత్సవానికి పటిష్ట బందోబస్తు

సింహాచలం: చందనోత్సవం రోజు సింహాచలం వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎలాంటి లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు నగర సీపీ ఎ. రవిశంకర్ తెలిపారు. ఈ నెల 10 న చందనోత్సవం సందర్భంగా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై సీపీ దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, పోలీసు అధికారులతో మంగళవారం సమీక్షించారు. సింహాచలంలోని పాత గోశాల కూడలి నుంచి చేసిన పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్టీసీ బస్సులో కొండదిగువ నుంచి సింహగిరిపైకి ఘాట్‌రోడ్డులో అధికారులతో కలిసి వెళ్లారు. మార్గమధ్యలో రద్దీ ఏర్పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించారు. మలుపులవద్ద ఆగి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ రద్దీని నివారించడంతో పాటు ప్రొటోకాల్ వాహనాలను ఘాట్‌రోడ్డులో నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.

క్యూలైన్ల పరిశీలన

భక్తుల దర్శనాల సమయాలు, ఉచిత మరియు రూ.300,రూ.1000, రూ.1500 టికెట్ల దర్శనాల క్యూలు, పార్కింగ్ ప్రాంతాలతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డులను సీపీ పరిశీలించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు చేపట్టాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ ఫకీరప్ప పాల్గొన్నారు.


సింహగిరిపై ఈవో శ్రీనివాసమూర్తితో ఏర్పాట్లపై చర్చిస్తున్న నగర సీపీ రవిశంకర్

ఓటుకు రేటు..!

- ప్రలోభాలకు సిద్ధమవుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ
- మహిళలకు రూ.4 వేలు, పురుషులకు రూ.3 వేలు
- నేతల రహస్య సమావేశంలో నిర్ణయం
- అర్ధరాత్రి డబ్బు పంపిణీకి ఏర్పాట్లు
- పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉండే ప్రాంతాల్లో సన్నాహాలు
- ఓటమి భయంతో అన్ని నియోజకవర్గాల్లోనూ అడ్డదారులు



ఆరు గ్యారెంటీలు ఎక్స్‌పైరీ డేట్‌వి అని జనం గుర్తించారు.
ఇచ్చిన హామీలన్నీ హంబక్ అని అర్థమైపోయింది.. ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి స్పష్టంగా వ్యతిరేకత కనిపిస్తోంది..
మొత్తంగా జనం నమ్మే పరిస్థితి కనిపించడం లేదు.. కోవిడ్ సమయంలో కనిపించని వారంతా ఇప్పుడెందుకు వస్తున్నారన్న ఎదురు ప్రశ్నే ప్రజల నుంచి వినిపిస్తోంది...
దీంతో.. ప్రజాభిప్రాయం తమకు వ్యతిరేకంగా ఉందని స్పష్టమైంది.
దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఎన్నికల కోడ్ గీడ్ జాన్తానై అని తెగించేశారు.
తిమ్మిని బమ్మిని చేసి ఎలాగైనా ఓటర్లను కొనెయ్యాలని సిద్ధమయ్యారు.
మూడు పార్టీల నేతలు రహస్యంగా సమావేశమై.. ఓటుకు రేటుని ఫిక్స్ చేసుకున్నారు. ఓటమి భయంతో అడ్డదారులు తొక్కాలని డిసైడైపోయారు.

సాక్షి, విశాఖపట్నం : ఎప్పటిలాగానే ఓటర్లను ఎలాగైనా డబ్బుతో కొనాలని టీడీపీ అండ్ కో సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం మూడు పార్టీల ముఖ్యనేతలు రహస్యంగా సమావేశమయ్యారు. ఓటర్లకు డబ్బులతో ఎలా కొనాలి..? పంపిణీ కేంద్రాలుగా ఏ ప్రాంతాల్ని ఎంపిక చేసుకోవాలి.? డబ్బుల్ని ఎలా పంపిణీ చేయాలి.? ఎవరితో చేయించాలి ఇలా.. ఎన్నో రకాల కుయుక్తులకు టీడీపీ నేతల ఆధ్వర్యంలో సాగిన సమావేశం వేదికగా మారింది. బీజేపీ, జనసేన నేతలు ఓటుకు వెయ్యి రూపాయిలు ఇస్తే చాలు.. జనమే ఓట్లేస్తారు.. అని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. అయితే.. టీడీపీ అభ్యర్థులు మాత్రం.. వెయ్యికి ఈ రోజుల్లో పని జరగదు.. ఎందుకంటే మన పార్టీలంటే జనమెవ్వరికీ కనీస గౌరవం లేదు. వాళ్లకోసం ఏమైనా చేస్తే కదా కొంచెమైనా ఫేవర్‌గా ఉండటానికి..అందుకే.. ఈసారి గట్టిగా ఖర్చు చేద్దాం.. పోతే ఆస్తులు పోతాయి.. గెలిస్తే పదిరెట్లు సంపాదించుకోవచ్చు.. అందుకే డబ్బులు ఎరవేయడంలో వెనక్కి తగ్గకూడదంటూ మాట్లాడినట్లు సమాచారం.

ఫిర్యాదులిచ్చినా దొరక్కుండా..

డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులందినా.. వాళ్లు వచ్చేలోపే మొత్తం సర్దేసే విధంగా పంపిణీకి స్థలాలు ఎంపిక కూడా చేసుకున్నారని తెలుస్తోంది. పోలీస్ స్టేషన్ల నుంచి దూరంగా ఉన్న ప్రాంతాల నుంచి మొదలు పెట్టాలని భావిస్తున్నారు. నోట్ల కట్ల రాజకీయంతో గెలవడమే తమ ముందున్న ఏకైక మార్గమని భావిస్తున్న మూడు దొంగల పార్టీలు.. జనాన్ని డబ్బుతో కొంటే చాలు.. వాళ్లే ఓట్లేస్తారనే ఉద్దేశంతో.. అడ్డదారులు తొక్కేందుకు రెడీ అవుతున్నారు. ఏది ఏమైనా వైఎస్సార్‌సీపీకి అన్ని చోట్లా అనుకూల పవనాలు వీస్తున్నాయని.. ఈ నేపథ్యంలోనే తమ్ముళ్లు నోట్ల కట్టల పంచాయతీ మొదలు పెట్టినా.. ఫ్యాన్ గాలిని ఎవరూ ఆపలేరని ప్రజల పల్స్ చెబుతోంది. కానీ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు టక్కు టమార మాయోపాయాలు పన్నుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మహిళలకు రూ.4 వేలు ఇచ్చేద్దాం..

సుదీర్ఘ చర్చలు జరిగిన తర్వాత టీడీపీ నేతలు ఓటర్లను కొనుగోలు చేసేందుకు రేట్లు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మహిళలకు సమున్నత గౌరవం ఇస్తూ.. ఆర్థికంగా సామాజికంగా చేయూతనందించిన నేపథ్యంలో వారంతా ఆ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని కూటమి నేతలు భావించారు. అదేవిధంగా విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలు, విద్యా పథకాలు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, నవరత్నాలే వాళ్లని గెలిపించేలా కనిపిస్తున్నాయని మూడు పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈసారి జనాల్ని గట్టిగా కొనేద్దామని ఫిక్స్ అయ్యారు. మహిళల్ని ఎలాగైనా తమవైపు తిప్పుకోవాలంటే ఓటుకు నోటు విషయంలో వారికి ఎక్కువ ప్రయారిటీ ఇద్దామనీ ఒక్కో మహిళా ఓటరుకు రూ.4 వేలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పురుషులకు రూ.3వేలు ఇస్తే సరిపోతుందని భావిస్తున్నారంట. అయితే జనసేన, బీజేపీ అభ్యర్థులు మాత్రం.. తాము అంత ఇచ్చుకోలేమని చెబుతుంటే.. ఖర్చుపెట్టండి.. గెలిచిన తర్వాత.. వాళ్ల దగ్గరి నుంచే పిండేసుకుందామంటూ టీడీపీ నేతలు ఉచిత సలహాలివ్వడంతో సదరు పార్టీ అభ్యర్థులు కూడా అంగీకరించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

వైఎస్సార్‌సీపీలోనే కాపులకు ప్రాధాన్యం

- కాపులను చిన్నచూపు చూసిన పార్టీలకు బుద్ధి చెబుతాం
- కాపు నాడు అధ్యక్షుడు తోట రాజీవ్



మాట్లాడుతున్న తోటరాజీవ్, జియ్యాని శ్రీధర్, పీలా ఉమారాణి తదితరులు

గోపాలపట్నం: రాష్ట్రంలో కాపులకు తగిన ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని, కాపులను చిన్నచూపు చూసిన పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని కాపునాడు అధ్యక్షుడు తోట రాజీవ్ అన్నారు. మర్రిపాలెం వుడాలేఅవుట్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 31 అసెంబ్లీ స్థానాలు, ఐదు ఎంపీ స్థానాలను కాపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేటాయించారన్నారు. సామాజిక న్యాయం అంటే ఇదేనని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కేవలం 23 స్థానాలు మాత్రమే కాపులకు కేటాయించారన్నారు. కాపులంటే ఈ పార్టీలకు చిన్నచూపని పేర్కొన్నారు. చంద్రబాబు కాపులపై కుట్రలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు కాపుల ద్రోహి అని విమర్శించారు. చంద్రబాబు భీమిలి టికెట్ అమ్మితే గంటా కొనుక్కున్నాడన్నారు. ఈ వ్యాపార రాజకీయాలకు త్వరలోనే ఫుల్‌స్టాప్ పడడం ఖాయమన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని జోస్యం పలికారు.

కాపులంటే గణబాబుకు ద్వేషం

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే గణబాబుకు కాపులంటే ఎప్పుడూ ద్వేషమేనన్నారు. కాపుల ఎదుగుదలను ఓర్వలేని నక్కజిత్తుల నాయకుడు గణబాబు అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా గుడివాడ నాగమణి పోటీ చేస్తే బహిరంగంగానే వ్యతిరేకించి ఓడించిన స్వార్థపరుడు గణబాబు అని అన్నారు. నాగమణిపై కోపంతో టీడీపీ జెండాలు తగలబెట్టిన చరిత్ర గణబాబుదన్నారు. కాపు ద్రోహి అయిన గణబాబుకు తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వడం బట్టి ఆ పార్టీ ఎంత నీచమైందో కాపులు గమనించాలని కోరారు. గత ఎన్నికల ముందు కాపు కల్యాణ మండపం నిర్మిస్తామని పద్మనాభ నగర్‌లో శంకుస్థాపన చేసిన గణబాబు తర్వాత పట్టించుకోవడమే మానేశాడన్నారు. దీనిపై ఆడారి ఆనంద్‌కుమార్ స్పందించి, ప్రభుత్వంతో చర్చించి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. పశ్చిమ పరిశీలకురాలు పీలా ఉమారాణి మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి జగనన్న ఎంతో మేలు చేశారని తెలిపారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉండే నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ పీవీ సురేష్ మాట్లాడుతూ 15 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్న గణబాబు నియోజకవర్గంలో ఏం చేశారని ప్రశ్నించారు. హెచ్‌పీసీఎల్ సీఎస్సార్ నిధులు రూ.34 కోట్లలో గణబాబు అవినీతికి పాల్పడిందని నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు మోహన్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీపార్వతి, వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీపార్వతి
- జిల్లా యాదవ సంఘం కుటుంబీకుల ఆత్మీయ సమావేశం

కంచరపాలెం: యాదవుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీపార్వతి తెలిపారు. బిర్లా జంక్షన్ కేరళ కళాసమితి భవనంలో జిల్లా యాదవ సంఘం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భరణికాన రామారావు, యాదవ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విశాఖ జిల్లా యాదవ సంఘం కుటుంబీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును యాదవులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్‌కు ఇచ్చిన గౌరవం, ఆదరణ.. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలను వంచించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తుంటే.. జగన్ మాత్రం ప్రజల కష్టాలను తన కష్టంగా భావించి సేవలందిస్తూ వారి హృదయాల్లో నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుల విజయానికి యాదవులంతా సహకరించాలని ఆమె కోరారు.

యాదవులంతా మద్దతివ్వండి: కె.కె.రాజు

కె.కె.రాజు మాట్లాడుతూ యాదవుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నికలు వన్‌సైడ్ కావాలంటే యాదవులంతా మద్దతివ్వాలని కోరారు. యాదవుల సంక్షేమంతోపాటు ప్రతి సమస్యను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే పిన్నింటి వరలక్ష్మి, కార్పొరేటర్లు చల్లా రజిని ఈశ్వరరావు, సారిపిల్లి గోవింద్, ఏపీఐడీసీ డైరెక్టర్ కాయిత వెంకటలక్ష్మి డీసీ ఇన్‌చార్జి తుల్లి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రొంగలి జగన్నాథం, జి.వి.రవిరాజు, బోర ఈశ్వరరావు, గొంప గోవింద్, కాయిత రత్నాకర్ పాల్గొన్నారు.

త్వరితగతిన చందనోత్సవం ఏర్పాట్లు

డాబాగార్డెన్స్: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఈ నెల 10న జరిగే చందనోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు. చందనోత్సవం ఏర్పాట్లపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వామి నిజరూప దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు విరివిగా అందించాలన్నారు. కొండపైన, కొండ దిగువన పలు ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేసి, వాటికి నిరంతరం నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నడక, రోడ్డు మార్గాల్లో త్వరగా విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాలతో పాటు స్వామి దర్శన మార్గాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. మూడు షిఫ్టుల్లో కార్మికులను నియమించి, ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. చందనోత్సవం ఏర్పాటు పనులు నిరంతరం పర్యవేక్షించేలా సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉంచాలని సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, అదనపు కమిషనర్లు వె.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు రవి, వినయ్‌కుమార్, శ్యాంసన్ రాజు, రామ్మోహనరావు, వేణుగోపాల్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు జైన్ సంఘం మద్దతు



ముఖ్యమంత్రి జగన్‌ని కలిసి మద్దతు తెలుపుతున్న జైన్ సంఘం ప్రతినిధులు

గాజువాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ నగరానికి చెందిన శ్రీజైన్ శ్వేతంబర్ తెరపంతి సభ (జైన్ సంఘం) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మనోజ్ కుమార్ దుగర్ ఆధ్వర్యంలో గాజువాకలో ముఖ్యమంత్రిని కలిసి తమ సంఘం తరఫున మద్దతు తెలిపారు. దశాబ్దాల తరబడి తాము వివిధ వ్యాపారాలను నిర్వహిస్తూ విశాఖ నగరంలోనే నివసిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్తర భారతదేశానికి చెందిన తాము హిందీ ప్రధాన భాషగా జైన్‌లు, అగర్వాల్స్, బ్రాహ్మణులు, సీఆర్‌బీ, మహేశ్వరి తదితర పేర్లతో నగర వ్యాప్తంగా సుమారు 10 వేల ఓట్లు కలిగి ఉన్నామన్నారు. ఒక్క విశాఖ దక్షిణ నియోజకవర్గంలోనే తమ కమ్యూనిటీలో 2,200 ఓట్లు కలిగి ఉన్నామన్నారు. 'గత ఐదేళ్లలో మీ పాలన పట్ల ఆకర్షితులమయ్యామని, అందుకే ఈ ఎన్నికల్లో మీ అభ్యర్థులకు మద్దతునిస్తున్నామ'ని ముఖ్యమంత్రికి తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

బీచ్ రోడ్డు: ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సాధారణ పరిశీలకుడు అమిత్ శర్మ అన్నారు. స్థానిక వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం మైక్రో అబ్జర్వర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులు గమనించి సమాచారం అందించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి వీల్లేదని ఈ సందర్భంగా అమిత్ శర్మ స్పష్టం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌పై సీఎం ప్రకటన హర్షణీయం

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు తాను ఒప్పుకోలేదని, అందుకే ప్రైవేటీకరణ ఆగిందని గాజువాక ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. అమర్‌నాథ్‌ను గెలిపిస్తే ప్రైవేటీకరణను నిలువరించేందుకు చర్యలు చేపడతామని సీఎం చెప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రకటన కార్మికుల్లో ధైర్యం నింపిందన్నారు. అమర్‌నాథ్‌ను గెలిపిస్తే ప్రైవేటీకరణకు వ్యతిరేకమని, కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే ప్రైవేటీకరణకు తామంతా అనుకూలమన్న సంకేతం కేంద్రానికి వెళ్తుందన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తిని అందరూ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువకుని పరిస్థితి విషమం

అన్నవరం: విశాఖ జిల్లా గాజువాకకు చెందిన ఒక ప్రేమ జంట స్థానిక లాడ్జిలో ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే లాడ్జి యాజమాన్యానికి విషయం తెలిసి సకాలంలో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆ జంటను తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా గాజువాకలోని ఒక షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న హర్షవర్ధన్, రాములమ్మ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. హర్షవర్ధన్ కు మరో అమ్మాయితో వివాహం అయింది. రాములమ్మ అవివాహిత. కాగా, వీరు సోమవారం రాత్రి అన్నవరంలోని లాడ్జికి వచ్చి తాము భార్యాభర్తలమని నమ్మించి గదిలో అద్దెకు దిగారు. మంగళవారం ఉదయం సిబ్బంది గదులు శుభ్రం చేస్తుండగా ఆ ప్రేమజంట ఉన్న గది తలుపు తీసి ఉంది. దాంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది గది లోపల చూడగా ఆ జంట మంచంపై అపస్మారక స్థితిలో ఉన్నారు. వారి పక్కన పురుగు మందు సీసా ఉండడంతో వెంటనే 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వీరిని అంబులెన్స్‌లో తుని ప్రభుత్వాసుపత్రికి తరలించగా వారికి అక్కడ వైద్యులు చికిత్స చేశారు. వీరిలో హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉందని అన్నవరం ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. ఎలాగా వివాహం చేసుకోలేదు, కలిసి చనిపోవాలని భావించి పురుగు మందు తాగినట్లుగా రాములమ్మ తెలిపినట్లు అన్నవరం ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీకి ఎక్సలెన్స్ అవార్డు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ 2023 సంవత్సరానికి అపెక్స్ ఇండియా ఫౌండేషన్ ద్వారా సీఎస్సార్ ఎక్సలెన్స్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ప్లాటినం అవార్డును పొందడం చాలా సంతోషంగా ఉందని సంస్థ హెచ్‌ఆర్ డీజీఎం శ్రీమంత మహాపాత్ర అన్నారు. ఈ నెల 4న ఢిల్లీలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని అపెక్స్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధుల నుంచి ఎక్సలెన్స్ అవార్డును ఆయన స్వీకరించారు. సమాజ అభివృద్ధి, స్థిరమైన పద్ధతులను పాటించినందుకు ఎన్టీపీసీ సింహాద్రికి ఈ అవార్డు దక్కిందని చెప్పారు. సామాజిక బాధ్యతలో అత్యుత్తమ విజయాలు సాధించిన వివిధ కార్పొరేట్ పరిశ్రమలను ప్రోత్సహించడమే లక్ష్యంగా అపెక్స్ ఇండియా ఫౌండేషన్ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విద్య, పర్యావరణం, ఆరోగ్యం, సంరక్షణ కార్యక్రమాలపై చుట్టుపక్కల గ్రామాల ప్రజల జీవన ప్రమాణాలపై సింహాద్రి ఎన్టీపీసీ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధను ప్రోత్సహించడమే ఈ అవార్డు ముఖ్య ఉద్దేశం.

మూడో రోజు 3,500 పోస్టల్ ఓటింగ్



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్ మల్లికార్జున, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నోడల్ అధికారి కె.ఎస్.విశ్వనాథన్



ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ ఉద్యోగులు

మహారాణిపేట: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మూడో రోజు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం అనేక మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం కూడా పలు శాఖల ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 13,076 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. తొలి రోజు ఆదివారం 3152 మంది, సోమవారం 5,822 మంది, మంగళవారం 3,500 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 12,474 మంది ఇప్పటి వరకు ఓటు వేశారు. ఇతర జిల్లాల సిబ్బంది 5,389 మంది ఉండగా ఆదివారం 1136 మంది, సోమవారం 1900 మంది, మంగళవారం 1100 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 4136 మంది ఓటు వేశారు.

ఏర్పాట్లపై ఉద్యోగుల హర్షం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు ఏడీసీ, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నోడల్ అధికారి కె.ఎస్.విశ్వనాథన్ దగ్గరుండి ఏర్పాట్లను సమీక్షించారు. ఉద్యోగులకు తాగునీరు, షామియానాలు, కుర్చీలు, తదితర వసతులు కల్పించారు. ఓటు వేయడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉద్యోగులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏయూ తెలుగు, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లపై పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

'వర్షా'తిరేకం!



కేఆర్ఎం కాలనీలో నేలకొరిగిన చెట్టు

- వడగాడ్పుల వేళ పన్నీటి జల్లులు
- భానుడి వేడిని చల్లార్చిన వరుణుడు
- నేడు, రేపూ తేలిక పాటి వర్షాలు





నగరంలో వర్షం

సాక్షి, విశాఖపట్నం : దాదాపు నెలన్నర రోజుల నుంచి విశాఖ వాసులు భానుడి ధాటికి వేగిపోతున్నారు. వడగాడ్పుల తీవ్రతతో సతమతమవుతున్నారు. సాధారణంకంటే 3–6 డిగ్రీల అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మేఘాలు, వర్షాల జాడ లేకపోవడంతో ఉష్ణతాపాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈ తరుణంలో మంగళవారం ఉదయాన్నే నగరంలో మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. కాసేపటికే వరుణుడు రంగప్రవేశం చేశాడు. ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న పన్నీటి జల్లులను కురిపించి అందరిలోనూ ఆనందాన్ని నింపాడు. ఇలా మధ్యాహ్నం వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాన్ని కురిపించి చల్లదనాన్ని పరిచాడు. ఆ తర్వాత రోజంతా మబ్బులు ఆవరించి ఉండడంతో భానుడి జాడే కనిపించకుండా పోయింది. ఇన్నాళ్లూ తెల్లారి లేచేసరికే సెగలు కక్కే వాతావరణాన్నే చవిచూస్తున్న వైజాగ్ వాసులు మంగళవారం అందుకు భిన్నంగా ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు. రోజంతా చల్లదనం పరచుకోవడంతో ఇన్నాళ్లూ రేయింబవళ్లు ఫ్యాన్లు, ఏసీలు విరామం లేకుండా వేసుకున్న వారు వాటితో పనిలేకుండా ఊరట చెందారు. నెల రోజుల నుంచి విశాఖ, పరిసరాల్లో 36 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాంటిది మంగళవారం 30.2 డిగ్రీలకు పడిపోయింది. ఇది సాధారణం కంటే 4.3 డిగ్రీలు తక్కువ కావడం విశేషం! కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు విశాఖలో రెండు సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సీతమ్మధారలో 2.8 సెం.మీలు, విశాఖ రూరల్ 1.7, పెందుర్తి 1.6, ఆనందపురం 1.3, సింహాచలం 1.2, పరదేశిపాలెం 1.2, గాజువాక 1.0, అగనంపూడి 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. ద్రోణి ప్రభావంతో బుధ, గురువారాల్లోనూ విశాఖ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.


సత్యానగర్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన పార్కు

పెందుర్తి ప్రగతి పరవళ్లు

ఇటు గ్రామీణం.. అటు పట్టణం మిళితమైన నియోజకవర్గం పెందుర్తి. గత ప్రభుత్వ హయాంలో మసకబారిన పెందుర్తి నియోజకవర్గ ప్రగతి.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సరికొత్త కళను సంతరించుకుంది. ఐదేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దేశానికే ప్రామాణికంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అత్యంత చేరువయ్యాయి. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో రూపాంతరం చెందాయి. రహదారులు అత్యంత సుందరంగా ముస్తాబయ్యాయి. కొత్తగా వచ్చిన అర్బన్/రూరల్ హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు చెంతకే వచ్చాయి. అన్నింటికీ మించి నియోజకవర్గంలో 33 వేల మంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేరింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎనలేని మేలు జరిగింది. ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందాయి.

– పెందుర్తి

- సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల సవారీ
- నవరత్నాల పథకాల ద్వారా రూ.వేల కోట్లు ప్రజల ఖాతాల్లోకి జమ
- గతంలో ఎన్నడూ చూడని విధంగా అభివృద్ధి

పార్కుల అభివృద్ధి

నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి కోసం రూ.8 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేశారు. రత్నగిరినగర్‌లోని స్పోర్ట్స్ థీమ్ పార్కు నిర్మాణానికి రూ.2 కోట్లు, చినముషిడివాడ సత్యనగర్ పార్కు నిర్మాణానికి రూ.2 కోట్లు, వేపగుంట సమీపంలోని షిప్ యార్డు లేఅవుట్ పార్కు నిర్మాణం కోసం రూ.2 కోట్లు కేటాయింపులు చేసి నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి పీపీపీ పద్ధతిలో దాదాపు రూ.2 కోట్ల నిధులు వెచ్చించారు.


పరవాడలోని ఇండోర్ స్టేడియం

రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం అభివృద్ధి

పరవాడ మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియంలో రూ.2 కోట్లతో క్రీడాకారులకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.


జుత్తాడలోని గ్రామ సచివాలయం

చెంతనే సేవలు

సచివాలయాలతో ప్రజలకు పాలన చేరువ చేశారు. జీవీఎంసీ పరిధిలో 43 సచివాలయాల నిర్మాణానికి రూ.15 కోట్లు వెచ్చించారు. అలాగే రూ.13 కోట్లతో 43 గ్రామ సచివాలయాలు నిర్మించారు. ప్రజలకు అత్యంత చేరువగా సేవలందిస్తున్నారు.

సంక్షేమ పథకాల లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న అమ్మ ఒడి	35,970	180.28
జగనన్న విద్యా దీవెన	18,222	62.19
జగనన్న వసతి దీవెన	14,736	36.98
వైఎస్సార్ రైతు భరోసా	29,953	163.29
ఉచిత పంటల బీమా	1,339	2.81
సున్నా వడ్డీ పంట రుణాలు	13,376	2.28
ఇన్‌పుట్ సబ్సిడీ	778	0.94
మత్స్యకార భరోసా	1,201	4.73
వైఎస్సార్ పెన్షన్ కానుక	36,955	360.13
వైఎస్సార్ చేయూత	21,356	117.12
వైఎస్సార్ ఆసరా	61,304	170.80
సున్నా వడ్డీ(డ్వాక్రా)	57,979	134.00
వైఎస్సార్ కాపు నేస్తం	643	12.14
ఈబీసీ నేస్తం	1,231	24.14
వైఎస్సార్ షాదీతోఫా	154	0.72
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	50,017	50.39
హౌసింగ్	10,538	46.53
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	3,743	5.20
వైఎస్సార్ బీమా	940	6.61
వైఎస్సార్ వాహనమిత్ర	5,412	22.78
వైఎస్సార్ నేతన్న నేస్తం	8	0.01
జగనన్న చేదోడు	2,764	6.55
జగనన్న తోడు	5,883	12.88
ఇంటి స్థలాలు(భూసేకరణ)	15,569	346.05
జగనన్న విద్యాకానుక	17,478	17.77
విద్యార్థులకు ట్యాబ్‌లు	3,813	13.10
జగనన్న తోడు(రుణాలు)	5,927	15.38
జగనన్న గోరుముద్ద	19,325	17.87
సంపూర్ణ పోషణ	39,322	89.71
వైఎస్సార్ కంటివెలుగు	28,964	60.10
ఇంటింటి రేషన్	58,763	126.80
పరోక్ష ప్రయోజనం	1,89,161	686.77


జుత్తాడలోని రైతు భరోసా కేంద్రం

అందరికీ ఆరోగ్యం

నియోజకవర్గంలోని 53 గ్రామ పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న 43 గ్రామ సచివాలయాల పరిధిలో రూ.8 కోట్లతో రూరల్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. అలాగే జీవీఎంసీ పరిధిలో 6 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు రూ.10 కోట్లతో నిర్మాణం చేశారు. పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.4.50 కోట్లతో అధునాతన సదుపాయాలు కల్పించారు. పేదలకు వైద్యం చేరువ చేశారు.


పరవాడలోని టిడ్కో ఇళ్లు

సొంతింటి కల నెరవేరిన వేళ

నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వం 33 వేల మందికి ఇంటి స్థలాలు ఉచితంగా అందించి వారి సొంతింటి కల నెరవేర్చే దిశగా అడుగులు వేసింది. అలాగే పెందుర్తి మండలం ముదపాకలో 25 వేల మంది నగరంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు అందించింది. సబ్బవరం మండలం పైడివాడలో నగరంలోని ప్రజలకు 10,400 ఇంటి స్థలాలు అందించింది. నియోజకవర్గంలో 46 లేఅవుట్‌లు వేసి జగనన్న కాలనీలు నిర్మిస్తున్నారు. మరో 1200 మందికి టిడ్కో ఇళ్లు మంజూరు చేసి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారు.


పురుషోత్తపురంలోని అర్బర్ హెల్త్ సెంటర్

పాఠశాలలు కళకళ

సబ్బవరం, పరవాడ, పెందుర్తి, జీవీఎంసీ 77, 88, 93, 94, 95, 96, 97, 98 వార్డుల పరిధిలో పాఠశాలలు, జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం నాడు–నేడు పథకం ద్వారా రూ.95 కోట్లు వెచ్చించారు. ఆయా నిధులతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు.


నంగినారపాడు పాఠశాల

పదేళ్లు కానరాని పంచకర్ల

జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు 2009లో పెందుర్తి ప్రజల ఓట్లతో ప్రజారాజ్యం తరఫున గెలిచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత 2010లో కాంగ్రెస్‌లో చేరిపోయి 2014 వరకు అధికారాన్ని అనుభవించారు. ఆ నాలుగేళ్లు తన అనుచరుల లబ్ధి తప్ప.. ప్రజల ఇబ్బందులు, సమస్యలను ఏనాడు పట్టించుకోలేదు. 2019 వరకు యలమంచిలి ఎమ్మెల్యేగా ఉండి మైనింగ్‌తో పాటు ఇతర అక్రమాలకు పాల్పడ్డారు. అప్పట్లో మైనింగ్ ద్వారా పంచకర్ల రమేష్‌బాబు రోజుకు రూ.6 లక్షలు సంపాదిస్తున్నారని స్వయంగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణే ఆరోపించారు. 2019లో యలమంచిలిలోనే టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలై అక్కడి ప్రజలకు దూరం అయ్యారు. అప్పటి నుంచి అటు యలమంచిలి ఇటు పెందుర్తి వైపు గాని కన్నెత్తి చూడలేదు. ప్రజలు ఎలా ఉన్నారన్నది కూడా పట్టించుకోలేదు. దాదాపు 10 ఏళ్లు పంచకర్ల రమేష్‌బాబు పెందుర్తి నియోజకవర్గానికి దూరంగా ఉండి.. తమకు ఏమీ చేయలేదని ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

ప్రజలందరికీ మేలు చేశాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో దాదాపు 33 వేల మందికి ఇంటి స్థలాలు ఇచ్చాం. అందులో చాలా మందికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వమే పూర్తి సహకారం అందించింది. కులం, మతం, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా ప్రతీ ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి, సొంత ఇంటి కల నెరవేర్చాం. సంక్షేమం విషయంలో అయితే ప్రతీ మండలానికి దాదాపు రూ.20 కోట్లకు పైగానే లబ్ధి చేకూరింది. అభివృద్ధి విషయంలో దాదాపు రూ.400 కోట్ల పైగా నిధులతో ప్రజలకు సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చాం. రైతు భరోసా కేంద్రాలు, రోడ్లు, అర్బన్/రూరల్ హెల్త్ సెంటర్‌లు, గ్రామ సచివాలయాలు, నాడు–నేడు ద్వారా పాఠశాలలు, కళాశాలల అభివృద్ధి, ఇతరాత్ర కార్యక్రమాల ద్వారా ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాం. కోవిడ్ సమయంలో ప్రభుత్వం అందించిన సహకారంతో పాటు నా సొంత నిధులు రూ.3 కోట్లకు పైగా వెచ్చించి ప్రజలను అన్ని విధాల ఆదుకున్నాం. నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి ఏం కావాలో తెలుసుకుని మరీ సహకారం అందించాను. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే నా లక్ష్యం.

– అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్యే, పెందుర్తి

ఫార్మాసిటీలో కొలువుల జాతర

పరవాడ ఫార్మాసిటీలో 20 ఎకరాల్లో ఏర్పాటైన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియో స్టెరీ యూనిట్‌ను గతేడాది అక్టోబర్‌లో ప్రారంభించారు. రూ.500 కోట్లతో నిర్మించిన ఈ కంపెనీలో ప్రత్యక్షంగా 750 మంది ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి. అలాగే లారస్ సంస్థ పరవాడలో యూనిట్–3కి రూ.240 కోట్ల నిర్మాణ వ్యయంతో శంకుస్థాపన చేశారు. తద్వారా 450 మందికి ఉపాధి కలగనుంది.

పరవాడ ఫార్మాసిటీలోని యుజియో స్టెర్లీ కంపెనీ



దశాబ్దాల కల నెరవేరింది

- పెందుర్తి మండలంలో రోడ్ల నిర్మాణం కోసం రూ.25.19 కోట్లు వెచ్చించారు.
- మండలంలో మరో రూ.12కోట్ల రహదారులు టెండర్ పూర్తి చేసుకుని ఉన్నాయి.
- పెందుర్తి మండలం పెదగాడి–చింతగట్ల రోడ్డును రూ.5.40కోట్లతో నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణం ఇక్కడి ప్రజల నాలుగు దశాబ్దాల కల. ఆ కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చింది.
- రూ.2.99 కోట్లతో సుజాతనగర్ ప్రధాన రోడ్డును నిర్మించారు.
- రూ.1.98 కోట్లతో బీఆర్‌టీఎస్ రహదారి– పులగానివానిపాలెం రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- రూ.12 కోట్లతో పెందుర్తి–సబ్బవరం ప్రధాన రహదారిని నిర్మించారు.
- రూ.కోటితో పాపయ్యరాజుపాలెం–లక్ష్మీపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- రూ.2 కోట్లతో పినగాడి–కోట్నీవానిపాలెం–గొరపల్లి–గొల్లలపాలెం రహదారి వేశారు.
- సబ్బవరం మండలంలో దాదాపు రూ.10 కోట్లతో రహదారుల నిర్మాణం పూర్తయింది.
- టిక్కలిపాలెం–నాయనమ్మపాలెం–వంగలి–ఒమ్మివానిపాలెం రోడ్డు నిర్మాణం కోసం రూ.3.15 కోట్లు వెచ్చించారు.
- పరవాడలో మండలంలో రూ.9 కోట్లతో రోడ్లు నిర్మాణం చేపట్టారు.
- రూ.2 కోట్లతో తానం–తాడి రహదారి నిర్మించారు.
- జీవీఎంసీ జోన్–8 పరిధిలోని రోడ్ల నిర్మాణం కోసం రూ.40 కోట్ల వరకు ఖర్చు చేశారు.
- సబ్బవరం, పరవాడ, పెందుర్తి గ్రామీణ మండలాల్లో తాగునీటి సదుపాయం కోసం రూ.27.45 కోట్లు నిధులు వెచ్చించారు.


పెందుర్తి వెంకటాద్రిపై రూ.1.50 కోట్లతో నిర్మించిన రహదారి

డైహార్ట్ 'ఫ్యాన్'

- జగనన్న గెలుపు కోసం తపిస్తున్న ఎన్నారై సంతోష్‌రెడ్డి
- 'వై ఓన్లీ జగన్.కామ్' పేరిట వెబ్‌సైట్ ఏర్పాటు
- ఎన్నికల ప్రచారానికి సింగపూర్ నుంచి వచ్చిన సంతోష్


నవరత్నాలు పేరిట రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌ను జగన్‌మోహన్‌రెడ్డితో ఆవిష్కరింపజేయిస్తున్న సంతోష్‌రెడ్డి(ఫైల్)

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): పేదల కష్టంలో అండగా.. ఆకలికి కంచంలో అన్నమైనట్లు పాలన సాగిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి అంటే ఆ యువకుడికి ఎంతో అభిమానం. నగరానికి చెందిన అతను సింగపూర్‌లో పని చేస్తున్నారు.ఈ ఎన్నికల్లో అభిమాన నేతను గెలిపించుకోవాలన్న తపన ఆ యువకుడిలో మెండుగా ఉంది. అతనే జగనన్న డైహార్డ్ ఫ్యాన్ అయిన పిల్లి సంతోష్‌రెడ్డి.అల్లిపురం ప్రాంతానికి చెందిన ఆయన సింగపూర్‌లో ఐటీ సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

గత ఎన్నికల్లో: 2019 ఎన్నికల సమరంలో జగనన్న గెలుపు కోసం సోషల్ మీడియా యాక్టివిస్ట్‌గా విస్తృత ప్రచారం చేశారు. 'వై ఓన్లీ జగన్.కామ్' పేరిట వెబ్‌సైట్ క్రియేట్ చేసి క్యాంపైన్ నిర్వహించారు. ఆ వెబ్‌సైట్‌ను ప్రజా సంకల్ప యాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఆయన చేతుల మీదుగానే ఆవిష్కరింపజేశారు. అంతే కాదు నవరత్నాలు పేరిట షార్ట్‌ఫిల్మ్ రూపొందించి ఏ పథకాలకు ఎవరు అర్హులు ? అన్న వివరాలు పొందుపరిచారు. గత ఎన్నికల్లో విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సంతోష్‌రెడ్డి ఆనందంతో సింగపూర్ వెళ్లి వర్క్‌లో నిమగ్నమయ్యారు.

2024 ఎన్నికల కోసం రెండు నెలల సెలవు.. వృత్తిరీత్యా సింగపూర్ లో ఉంటున్నప్పటికీ.. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సింగపూర్‌లో ఉంటున్న తెలుగు ప్రజలకు వివరిస్తూ అభిమానం చాటుకుంటున్నారు. సంతోష్‌రెడ్డి అభిమానం చూసిన పార్టీ అధిష్ఠానం సింగపూర్ వైఎస్సార్ సీపీ విభాగానికి కో కన్వీనర్‌గా నియమించింది. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సంతోష్‌రెడ్డి 2 నెలల పాటు తన ఉద్యోగానికి సెలవు పెట్టారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. 2024 ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టు 'సాక్షి'కి తెలిపారు.

జగన్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఏటా వృద్ధులకు అన్నసమారాధనతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పేదల ముఖాల్లో చిరునవ్వు చిందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనలాంటి ఎందరికో స్ఫూర్తి అన్నారు. కూటమి పేరిట వారు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగనన్నను ప్రజలే సీఎం చేసుకుంటారని చెప్పారు.

భీమిలి తీరంలో తొట్లకొండ



200 ఏళ్ల పైబడిన చరిత్ర కలిగిన సెయింట్ పీటర్స్ చర్చి



అందాల లోగిలి.. భీమిలి

- సుందర సముద్ర తీరం ప్రత్యేకత
- 1861లోనే మున్సిపాలిటీగా ఏర్పాటు
- 43 ఏళ్లు పాలించిన క్షత్రియ అభ్యర్థులు


ఓటర్ల వివరాలు
2024 జనవరి నాటికి మొత్తం ఓటర్లు **3,63,013**
పురుషులు **1,78,090**
మహిళలు **1,84,908**
ఇతరులు: **15**

తగరపువలస : పురాణగాథలు, చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే భీమిలి పట్టణం ఎంతో ప్రాచీనమైనది. విశాఖ నగరం కంటే ఎన్నో వందల సంవత్సరాలకు ముందే ఏర్పడింది. మొట్టమొదటి సారిగా డచ్ దేశస్తులు వ్యాపార స్థావరం పేరుతో భీమిలిలో అడుగుపెట్టగా 18వ శతాబ్దంలో బ్రిటీషర్లు శాశ్వత స్థావరాలు ఏర్పాటు చేసుకుని సముద్ర మార్గాన ఎగుమతులు, దిగుమతు చేశారు. వారి పాలనకు గుర్తుగా భీమిలిలో ఇప్పటికీ ఇంపీరియల్ బ్యాంకు, గంటస్తంభం, సత్రాలు, లైట్‌హౌస్ వంటి ఆనవాళ్లు కనిపిస్తాయి. సౌమ్యగిరి పైనుంచి సూర్యోదయంలో వంపులు తిరిగిన గోస్తనీ, సాగర సంగమ తీరం పర్యాటకులకు మధురానుభూతిని కలిగిస్తుంది. బ్రిటీషర్లు తమ పరిపాలన, వ్యాపార సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన దక్షిణ భారతదేశంలోని మొట్టమొదటి మున్సిపాలిటీని భీమిలిలో 1861లో ఏర్పాటు చేశారు. అలాగే భీమిలి పట్టణానికి కేవలం 12 కిలోమీటర్ల పరిధిలో క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో బౌద్ధమత ప్రచారం నిమిత్తం తొట్లకొండపై వారు నడయాడిన ఆనవాళ్లు ప్రపంచ పర్యాటకులకు తరగని సంపద. దీంతోపాటు బావికొండ, పావురాల కొండపై వీటిని తిలకించవచ్చు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో బాపూజీ భీమిలి తీరప్రాంత మత్స్యకార గ్రామాలను సందర్శించారు. కేరళ రాజధాని త్రివేండ్రంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం తర్వాత రెండోది పద్మనాభంలో ఉంది. • మూడు మెడికల్ కళాశాలు, 15 ఇంజినీరింగ్, 5 పాలిటెక్నిక్, పలు డెంటల్, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలతోపాటు కార్పొరేట్ విద్యాసంస్థలు ఇక్కడ ఉన్నాయి.


1861లో ఏర్పాటైన భీమిలి మున్సిపాల్టీ భవనం

ఇదీ భీమిలి భౌగోళిక స్వరూపం

- 1952 నుంచి 2004 వరకు భీమిలి నియోజకవర్గంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతోపాటు విజయనగరం జిల్లాలోని జామి మండలం, విజయనగరం రూరల్ మండలంలోని 11 పంచాయతీలు ఉండేవి.
- 2009 నుంచి భీమిలి నియోజకవర్గంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతోపాటు భీమిలి మున్సిపాలిటీలోని 28 వార్డులు, జీవీఎంసీ పరిధిలో చినగదిలి మండలంలో మధురవాడ జోన్ 4, 5 వార్డులు, ఎండాడ, సాగర్‌నగర్, అడవివరం, ఎల్లపువానిపాలెం ప్రాంతాలు చేరాయి.
- 2021 నుంచి భీమిలి నియోజకవర్గంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, జీవీఎంసీలో భీమిలి మున్సిపాల్టీని విలీనం చేయడంతో 28 వార్డులకు బదులుగా 1, 2, 3, 4 వార్డులు ఏర్పడ్డాయి. ఇందులో భీమిలి తీర ప్రాంత పంచాయతీలైన నిడిగట్టు, చేపలుప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెం, జీవీ అగ్రహారం పంచాయతీలను విలీనం చేశారు. విశాఖ రూరల్ మండలంలో 5, 6, 7, 8 జీవీఎంసీ వార్డులతోపాటు ఎల్లపువాని పాలెం(గోపాలపట్నం వద్ద), అడవివరం, సాగర్‌నగర్, ఎండాడ, వెంకోజీపాలెం వద్ద కొన్ని నివాసాలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి.



గోస్తనీ సాగర సంగమ తీరం

ఇక్కడ క్షత్రియులదే ఆధిపత్యం


1952 నుంచి 2019 వరకు నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరగ్గా 6 సార్లు టీడీపీ, 5 సార్లు కాంగ్రెస్, ఒక్కసారి ఇండిపెండెంట్ కలిగొట్ల సూర్యనారాయణ (1952), ప్రజా సోషలిస్ట్ పార్టీ తరఫున గొట్టుముక్కల జగన్నాథరాజు (1957)గెలిచారు. 1957 నుంచి 1999 వరకు వరుసగా 10 సార్లు 43 ఏళ్లు క్షత్రియ అభ్యర్థులే భీమిలి పీఠాన్ని అధిష్టించగా 1952, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో కాపు అభ్యర్థులు హవా సాగించారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి హవాతో ఆ పార్టీ నుంచి కర్రి సీతారాం గెలుపొందారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజుపై 241 ఓట్లతో సీతారాం గెలిచారు. పీఆర్పీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు (2009)లో విజయం సాధించారు. తిరిగి 2014లో ఆ పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు (2019)లో టీడీపీ అభ్యర్థి సబ్బం హరిపై గెలిచారు.

ముత్తంశెట్టి వైపు మొగ్గు

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ తరఫున గంటా శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుంది. 2014 నుంచి 2019 మధ్య కాలంలో కనీసం అభివృద్ధి చేయకపోగా భూ కబ్జాలు, ఆక్రమణలతో భీమిలి ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో మంటగలిపేశారనే ఆగ్రహం స్థానికుల్లో వుంది. ప్రతీ ఎన్నికకూ ఓ నియోజకవర్గం మార్చడంతోపాటు ప్రజలకు అందుబాటులో వుండరనే భావన ఓటర్లలో వుంది. ఈ పరిస్థితుల్లో జరుగుతున్న ఎన్నికల్లో గంటాకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

నిత్యం ప్రజల్లోనే ఎమ్మెల్యే ముత్తంశెట్టి

వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముత్తంశెట్టి ప్రతీ ప్రాంతాన్నీ దాదాపు 20 సార్లుకు పైగా సందర్శించిన ట్రాక్ రికార్డ్ వుంది. ప్రత్యేక చొరవ తీసుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం నుంచి కోట్లాది రూపాయల బకాయిలు ఇప్పించి శెభాష్ అనిపించుకున్నారు. ఈ ఎన్నికల్లో సీఎం జగన్‌కు వున్న ప్రజాభిమానంతో సునాయాసంగా గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు వైఎస్సార్‌సీపీకి బలమైన మద్దతుదారులుగా నిలవడంతో ఈ ఎన్నికల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైపే మొగ్గు కనిపిస్తోంది.


ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైఎస్సార్‌సీపీ)


గంటా శ్రీనివాసరావు (టీడీపీ)